



# వేట

జె. చంద్రమోహన్

(గత సంచిక తరువాయి)

జీపు డ్రైవర్ అంబాజీని, పైడితల్లిని తీసుకొని సామాను వేసుకొని బయల్దేరారు నాయుడుగారు ఆయన ఉత్సుకతతో వున్నారు.

గూడెం చేరుకొని జుంబావోగాడి గురించడిగితే "వాడుమధ్యాహ్నంఅనగా అడవిలోకి వెళ్ళాడు దొరః ఇంత వరకు రాలేదు" చెప్పాడు ముజాంరా.

నాయుడుగారి కోపం నషాలానికి అంటుకుంది. ఒకవైపు చీకటిపడిపోతున్నది. వీడుఇంతవరకు పత్తాలేడు. అసహనంగా వాడిగురించి ఎదురు చూస్తూ ఒక చప్టామీద కూర్చున్నారు ఆయన. ఒక అరగంటతర్వాత జుంబావో నీరసంగా నడుచుకుంటూ వస్తూకనిపించాడు

"ఎక్కడికి పోయావురా" నాయుడుగారు గర్జించారు.

"పైడితల్లి, మధ్యాహ్నంవచ్చిచెప్పినపుడు మంచె ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటోందోని చూడడానికి వెళ్ళాను దొర చెప్పాడు.

"మరి ఏర్పాటు చేశావా?"

"చిత్తం. చెట్లమీద పులిగుర్తులు (పులులు అప్పుడప్పుడు గోళ్ళుపదును పెట్టుకోడానికి చెట్టు మొదళ్ళమీద గీరుతాయి)చూసుకుంటూ వెళ్తే పులిఅడుగు జాడలు కనిపించాయిదొర. అవికూడా కొద్దిదూరం వరకే! అక్కడ నుంచి చూస్తేవెదురు తోపు దగ్గరే మనంఇంతకుముందు వేటాడిన స్థలం ఇవతల పక్కన అక్కడే ఉన్నచెట్టుమీద మంచె ఏర్పాటు చేశాను. దగ్గరలోనే ఎరనుకట్ట డానికి పొదలూ. అవీ ఉన్నాయి అజాగ చూసి మంచెకట్టి వచ్చేటప్పటికి ఇప్పటికైంది" చెప్పాడు జుంబావో.

ఈ మాటలు వినగానే శాంతించారు నాయుడుగారు. "సరే! తొందరగాఎరను తీసుకొని తగలడు"

"చిత్తం ఇప్పుడే వస్తి" గూడెంలోకి వెళ్ళాడు. వెళ్ళిన కొద్దిసేపటికిఒక తెల్ల మేకనుతీసుకొని వచ్చాడు.

అంతకుముందే నాయిడుగారు, పైడితల్లి, అంబాజీ ఖుష్టుగా భోంచేశారువేట మాంసంతో.

"ఏరా ఏమైనా తిన్నావా?" అడిగారు నాయుడుగారు. జుంబావోను "అడవి నుండి ఇప్పుడేగద దొర వస్త ఏమీ తినలే" చెప్పాడు.

"ఆరి నీపాసుకూల! మరిచెప్పవేంరా ఎమీ తినకుండా ఎలావస్తావు. ఏమైనా తిని తొందరగారా"

"చిత్తం యిగోవస్తి" గూడెంలోకి పోయాడు మళ్ళి.

పావుగంట తర్వాత నాయుడుగారు, పైడితల్లి, జుంబావో బయల్దేరారుఅడవిలోకి ఎరతో సహా!

"ఏరాపులివస్తుందంటావా జుంబావో" నుద్దేశించి అడిగారు.

తప్పకవస్తుంది మళ్ళీ గూడెం మీద పడి మొన్న ఒకఎద్దును అవలీలగఎత్తుకెళ్ళినాది దొర.

"అయితే అదిదాలా "పెద్ద"పులి అయివుంటుందనిపించింది నాయుడుగారికి. పులులు నోటితో ఒక ఎద్దును సులభంగా ఎత్తుకొని పరిగెత్తగలవు.

ముందు జుంబావో ఒక చేతిలో బల్లెం ఇంకొకచేతిలో మేకను కట్టిన తాడుతో దారి తీస్తున్నాడు మధ్యలో నాయుడుగారు చేతిలో లోడ్ చేసిన తుపాకీతో చివరగా టార్చి పట్టుకొని పైడితల్లి నడుస్తున్నారు.

ఈసారి నాయుడుగారు సెల్ఫ్ వేసే టప్పుడు ఇంతకు ముందు చేసిన పొరపాటు చేయకుండా జాగ్రత్తగా చూసి ఒకదాని తర్వాత ఒకటి వేసారు.

చీకటి దట్టంగా పేరుకొని ఉంది. వాళ్ళువేసే ప్రతి అడుగు జాగ్రత్తగా చూసుకొని మరీ వేస్తున్నారు. పొదలలో చిన్నచప్పుడైనా ముగ్గురూ ఎలర్ట్ అవుతున్నారు కీచురాళ్ళ ధ్వని తప్ప అడవంతా నిశ్శబ్దంగా ఉంది. అప్పుడప్పుడు ఏదో పక్షి కొద్దిదూరంలో అరుస్తుంది.

కొద్దిగా దూరమైనా వెదురు పొదల దగ్గర పులులుబాగా సంచరిస్తాయని జుంబావో మంచె అక్కడ ఏర్పాటు చేసాడు. నడుస్తున్నవాడల్లా హఠాత్తుగా ఆగిపోయాడు. వెనకనే నడుస్తున్న నాయుడుగారికి, పైడితల్లికి కూడాఅర్థం కాలేదు. జుంబావో ఎందుకంత హఠాత్తుగా ఆగిపోయాడో!

మనిషి చెక్కబొమ్మల్లె బిగుసుకు పోయాడు నాయుడుగారుకొద్దిగాముందుకొచ్చి జుంబావో భుజంమీద నుండి ముందుకు చూశారు. అంతే! గుండె ఆగినంత పనయింది. కాళ్ళలోసన్నగా వణుకు బయలుదేరింది ఎదురుగా ఒక పాతిక గజాలదూరంలోపులి. జుంబావో చేతిలో ఉన్న తాడుతో కట్టబడిన తెల్ల మేక పులిని చూడగానే గట్టిగా అరిచి

విదిలించుకొని అడవిలోకి పారి పోయింది.

పులిదృష్టి మేకమీద లేదు. ఇప్పుడు అది జుంబావోనేచూస్తున్నది తీక్షణంగా దాని కళ్ళు ఆ చీకట్లో గమ్మత్తుగా మెరుస్తున్నాయి. జుంబావోకు నాయుడుగారికి మృత్యువు ఎంతోదూరంలో లేదనిఅర్థం అయిపోయింది; తప్పించుకొనే వ్యవధి కూడాలేదు. దగ్గరలో చెట్లున్నాకూడా. పులి వాళ్ళను చాలా దూరం నుంచే గుర్తు పట్టి పొదలలో మాటు వేసిందని దగ్గరకు రానిచ్చి పొదంలో పాకుతూ ముందుకొచ్చి వాళ్ళదారికి దగ్గరలోవుంది ఒక్కసారి వాళ్ళపై దూకాలని దాని వుద్దేశ్యం. ఒక్కసారి దగ్గరగా ఎదురుగా తను కన్పిస్తేవాళ్ళుఏమి చేయలేరని తెలుసు.

పొద్దుటినుండి అలసి పోవడం వల్ల జుంబావో కూడాదాని జాడ పసికట్టలేక పోయాడు ఇప్పుడు ఏం చెయ్యాలో నాయుడుగారికి అర్థంకావటం లేదు. ఆయన బుర్ర చురుకుగా ఆలోచిస్తుంది. ఒకవేళ పులి ఎటాక్ చేసినా జుంబావో మీదకే. తనకి పైడితల్లికి ఏమికాదు తప్పించుకోవచ్చు కాని ఆయన ఆలోచించేదివేరే. ఇప్పుడు ఇంత దగ్గరగా పులిని ఎదిరించి జుంబావో విలువలేదు. ఎలాగైనా జుంబావోను పులిఎత్తుకెళ్ళదం ఖాయం.

ఎటుతిరిగి, జుంబావోకు పులి చేతిలో చావు తప్పదు. కాబట్టి తను కొద్దిగా జుంబావోకు సైడు తీసుకొని దానిని షూట్ చేస్తే తగంవన్నా తగులుతుంది లేక జుంబావో అయినా గాయ పడతాడు. తను ఇప్పటి పరిస్థితులలో అలాంటి రిస్కు తీసుకోక తప్పదు.

ఒక వేళ జుంబావోను ఎత్తికెళ్ళిం తర్వాత అది మాపీటర్‌గా మారి ఇంకా ప్రమాదానికి దారి తీయవచ్చు. ఇలా ఆలోచించి తుపాకిని భుజం మీద ఆనించుకొని పులిని చూస్తూనే సెఫ్టీ కాచ్ తీశారు.

ఇదంతా క్షణాల మీద జరిగి పోయింది. నాయుడుగారి వెనుక ఉన్న పైడితల్లికి పరిస్థితి కొద్దిగా అర్థం అయింది. కాని తను ఏమి చేయలేక పోతున్నాడు. పులి నెమ్మదిగా తోక వూపుతుంది. అంటే ఎటాక్ చేయబోయే ముందు సిగ్నల్ అది.

నాయుడుగారు నెమ్మదిగా జుంబావోకు కొద్దిగా సైడు తీసుకున్నారు. చూస్తుండగానే పులి నెమ్మదిగా ముందు కాళ్ళను భూమిమీద వంచి ఒక జంప్ తీసుకొని జుంబావో మీదకు దూకింది.

జుంబావో పని అయిపోయింది. అప్పటిదాకా చచ్చిన శవంలా బిగుసుకున్న జుంబావో కదిలి ఒక్కసారిగా దానిపొట్టలో బల్లెం గుచ్చాడు– అని అనుకున్నాడు. కాని బల్లెం ఎటు పోయిందో. పులి ఎడమ పంజాతో ఒక్కసారి జుంబావో జబ్బ చీరేసింది. వెంటనే నాయుడుగారు పక్కకు తప్పుకున్నారు. జుంబావో కింద పడ్డాడు. పులి ఎగిరి జుంబావో మీదపడి కరుచుకొని పోబోయింది. "ధన్" అప్పుడు పేలింది నాయుడుగారి తుపాకి. గురి చూసి దాని నొసటి మధ్యలో పేల్చారు.

జుంబావో మీదకు రాబోతున్న పులి ఒక్కసారి వెనక్కి విరుచుకొని పడి పోయింది. పడిన వెంటనే అంతే వేగంతో లేచి అడవిలోకి పరుగు తీసింది.

శత్రువులు ముగ్గురు. వాళ్ళ దగ్గర ఆయుధాలున్నాయి. తను విపరీతంగా గాయ పడింది. వాళ్ళను ఎదుర్కోలేనని దానికి తెలిసిపోయింది. వేగం పెంచి అడవిలోకి మాయంఅయింది.

నాయుడుగారికి ఏమైందో అర్థం కావడం లేదు. జుంబావో పని ఈ రోజుతో ఖాళీ అనుకున్నవాళ్ళు, బ్రతికి బట్టకట్టడంతో వాళ్ళకు, జుంబావోకు చాలా ఆశ్చర్యంగా వుంది. వాళ్ళ ముగ్గురు తేరుకోవడానికి కొంత సేపయింది.

నాయుడుగారికి నిస్పృహ ఆవరించింది. కాని అది కొద్దిసేపు మాత్రమే; జుంబావో బ్రతికాడు అన్న ఆనందం దానిని మరిపించింది. ముగ్గురి బట్టలు చెమటతో తడిసిపోయాయి. ముందు పైడితల్లి టార్చ్ వేసి ఒంగి జుంబావోను చూశాడు. కుడిభుజం పులి పదునైన గోళ్ళతో చీరుకొని పోయింది. రక్తం విపరీతంగా స్రవిస్తుంది. నాయుడుగారు నెమ్మదిగా చెయ్యి అందించి లేపారు. వెంటనే పైడితల్లి షర్ట్ తీసి గట్టిగా గాయానికి కట్టారు. రక్తం స్రవించకుండా; పైడితల్లి సహాయంతో నెమ్మదిగా నడిపించి గూడెం తీసుకొచ్చారు. అప్పటికి మూడు గంటలవుతుంది. రక్తం బాగా పోవడంతో జుంబావో చాలా నీరసంగా తయారయ్యాడు.

అంత రాత్రప్పుడు కూడా గూడెం గూడెం మొత్తం వీళ్ళ చుట్టూ గుమికూడి ఉన్నారు. ఆడవాళ్ళు నాయుడుగారికి భయపడి నోట్లో గుడ్డలు కుక్కుకొని లోలోన ఏడుస్తున్నారు. మొగవాళ్ళు చాలా కంగారు పడుతున్నారు ఏమి చెయ్యాలాని;

ఎవరో అప్పటికప్పుడు ఏవోఆకులు నూరుకొని వచ్చి ఆ గాయానికి కట్టు కట్టారు. రక్తం స్రవించడం కొద్దిగా ఆగింది.

పైడితల్లి. అంబాజీ ఒకపక్క నిలబడి ఇదంతా చూస్తున్నారు నాయుడుగారు. చప్టామీద కూర్చొని ఆలోచిస్తున్నారు. ఇప్పుడు తను వీడిని శ్రీశైలం తీసుకొని వెళ్తే అక్కడ ఈ పులి సంగతి ఎవరు చూస్తారు; వీడికి ప్రమాదమేమీ లేదు.

అంబాజీకి చెప్తే శ్యామలను చేర్పిన హాస్పిటల్‌కి తీసుకొని వెళ్తే అక్కడ వీడికి సరైన వైద్యం జరుగుతుంది. ఈ పని తను వెళ్ళినా జరుగుతుంది. వెళ్ళకున్నా జరుగుతుంది.

కానీ, ఇక్కడ తను బాగా గాయపడ్డ పులిని వదిలి వెళ్ళడానికి లేదు. ఇప్పటికి అది బాగా గాయపడ్డంవల్ల ఎంతో దూరం పోయివుండకపోవచ్చు. వెంటనే తను దానిని వెంబడిస్తే అది దొరకవచ్చు. ఇలా అనుకొని అంబాజీని పిల్చారు.

"నీవు వెంటనే జీపుమీద వీడిని అమ్మగారిని చేర్పిన హాస్పిటల్‌కి తీసుకొని పోయి డాక్టరుని వీడి గాయానికి వైద్యం చేయమన్నాని నేను చెప్పినట్లు చెప్పు. అమ్మగారిని కలుసుకొని ఈ సంగతి చెప్పి నేను రేపు వస్తున్నట్లు చెప్పు."

"సరేనండి" కదల బోయాడు అంబాజి.

"ఇగో; ఇంకొక మాట. వీడిని అక్కడ ఎడ్మిట్ చెయ్యాలంటే ఎడ్మిట్ చేసి పెంచలయ్యకు వీడిని కూడా చూస్తుండమని చెప్పి నీవు వెంటనే జీపు తీసుకొనిరా. మళ్ళీ మనం సాయంత్రం కల్లా దొంకలపల్లి చేరి పోవాలి.

"సరేనండి" బయల్దేరాడు అంబాజీ.

జుంబావోను, గూడెం పెద్ద ముజంరాను మరొక గూడెం వాడిని ఎక్కించుకొని జీపు రయ్యిమని నక్కలవాగు మీదవున్న చెక్కల వంతెనను దాటుకొని ఫుట్ రోడ్డు పట్టింది. నాయుడుగారు వాళ్ళు వెళ్ళిన వైపు చూస్తూ దీర్ఘంగా నిట్టూర్చి పైడితల్లిని పిల్చారు.

"మనం వెంటనే మళ్ళీ అడవిలోకి పులిని వెదుక్కుంటూ వెళ్ళాలి గూడెంలో ఎవరైనా ధైర్యం గల యువకులను ఇద్దరిని రెడీ చెయ్యి

"చిత్తం అలాగే;"

"ఇగో నాకు పడకకూడా ఏర్పాటు చెయ్యి. ఒకగంట విశ్రాంతి తీసుకొని వెళ్దాం" చెప్పారు నాయుడుగారు.

"చిత్తం అలాగే;" వెళ్ళాడు పైడితల్లి.


రెండు గంటల తర్వాత నాయుడుగారు, పైడితల్లి ఇంకా ముగ్గురు గూడెం యువకులు బయల్దేరారు. అడవిలోకి పులిని వెదుక్కుంటూ. అప్పటికి తెలతెల వారుతుంది.

❀ ❀ ❀

ఇంతకు ముందు ప్రయాణించిన దారిలోనే వెళ్తున్నారు. ఒక అరగంట ప్రయాణించేటప్పటికి ఇంతకు ముందు పులి ఎటాక్ చేసిన ప్రదేశం వచ్చింది. పరీక్షగా ఆ చుట్టుపక్కల చూసుకుంటూ నడుస్తున్నారు అయిదుగురూ; కొద్దిదూరంలో రక్తం చుక్కలు కన్పించాయి. సమీపంలోనే జుంబావో బల్లెం కూడా కన్పించింది. దానికి ఎండిపోయిన రక్తం అంటివుండటం నాయుడుగారు గమనించారు.

వంగి దానిని చేతితో తీసుకొని పక్కనున్న గూడెం వారికిచ్చి రక్తం చుక్కలు, చుక్కలుగా కారిన ప్రదేశం చూసుకుంటూ ముందుకు కదిలారు. నాయుడుగారి చేతిలో లోడ్ చేసిన గన్ ఉంది. అలా కొద్దిదూరం పోయిన తర్వాత అవికూడా లేకుండాపోయాయి.

ఇప్పుడు పులి జాడ కనుక్కోవడం ఎలా? తలా ఒక దిక్కుకుపోయి వెదికితే– అబ్బో చాలా ప్రమాదం. దెబ్బ తిన్న పులి కోపం కసి మీద వుంది. ఒంటరిగా చూసి చావుదెబ్బ తీసే ప్రమాదం వుంది. అందరూ కలిసే



చూశారు తంబాజీ. పులికూనల్ని ఎత్తుకొని జీపుఎక్కి ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు పైడితల్లి. నాయుడుగారెక్కారు తర్వాత నెమ్మదిగా బయలుదేరింది జీపు.

గూడెంలో వాళ్ళకి ఇదేమీ అర్థం కావటంలేదు. గూడెం గూడెం అంతా అక్కడ పోగైంది. జీపు వెళ్లినతర్వాత నాయుడుగారితో వచ్చిన గూడెంవాళ్ళు వివరించి అక్కడ ఉన్నవాళ్లకి వాళ్ళు చూసింది చెప్పారు. గూడెం పెద్దతో సహా అక్కడ ఉన్నవాళ్ళంతా చాలా బాధపడ్డారు. పులిని గూడెం తీసుకొచ్చి దాని తోలు, గోళ్లు తీసి నాయుడుగారికివ్వడానికి అప్పటికే సన్నాహాలు ప్రారంభమైనాయి.

దొంతలపల్లి వెళ్లిన నాయుడుగారు స్నానంచేసి ఏదో కొద్దిగా తిన్నానని పించి పైడితల్లికి ఆ పులి కూనలకు పాలుపోసి జాగ్రత్తగా చూడమనిచెప్పి శ్రీశైలం బయలుదేరివెళ్ళారు. నాయుడుగారు వెళ్ళేటప్పటికి శ్యామలాంబ మంచం మీద పడుకొని బత్తాయినకు;

తొనలు వల్చుకొని తింటున్నారు. ఆయనను చూసి నెమ్మదిగా నవ్వి సర్దుకొని కూర్చుంది. ఆయన మంచంమీద కూర్చొని

"ఎలా వుంది శ్యామలా" అడిగారు తల నిమురుతూ.

"బాగానే వుందండి జ్వరం తగ్గిపోయింది. డాక్టర్‌గారు ఒక విషయం చెప్పారు" సున్నసిగ్గుతో చెప్పింది శ్యామలాంబ.

"ఏమిటో ఆ విషయం"

"................" మౌనం వహించింది.

నాయుడుగారికి అర్థంకాలేదు.

"నేను ఇప్పుడే డాక్టర్‌గారి దగ్గర కెళ్లొస్తాను" లేవబోయారు చప్పున ఆయన చేతినిపట్టి ఆపి కూర్చోమని సైగచేసి "మరే. మరే.... మీరు మీరు తండ్రి కాబోతున్నారు" చెప్పేసింది.

"నిజమా?" ఆశ్చర్యపోయారు.

"నిజమే! నిన్న డాక్టర్‌గారు చెప్పారు. మీకు ఎప్పుడెప్పుడు ఈ సంగతి చెబుదామా అని ఎదురుచూస్తున్నాను" చెప్పింది.

ఒక్క ఉదుటున లేచి డాక్టర్ దగ్గర కెళ్ళారు నాయుడుగారు. పొద్దున జరిగిన విషయాలేవి ఇప్పుడు ఆయనకు గుర్తుకురావటం లేదు.

డాక్టర్ రూమ్‌లో అడుగుపెడుతూనే–

"కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ నాయుడూ" చెప్పారు డాక్టర్.

"థాంక్స్ డాక్టర్ మెనీమెనీథాంక్స్. అయితే నేను విన్నది నిజమేనన్నమాట" అడిగారు.

"అక్షరాలా నిజమే. మీకు పెళ్లయిన ఇన్నాళ్లతర్వాత మీరు తండ్రి కావటం నిజంగా సంతోషకరమైన వార్త. కాని ఆమెని ఇప్పుడు కొద్దిగా జాగ్రత్తగా చూసుకోవాలి" చెప్పారు డాక్టర్.

మరుసటిరోజు బయలుదేరుతుంటే ఏమేం జాగ్రతలు తీసుకోవాలి. ఎలాంటి ఆహారం తీసుకోవాలి మొదలైన విషయాలు చెప్పారు డాక్టర్.

ఆయనకు ఫీజు ఇచ్చి జుంబావోను కూడ తీసుకొని బయల్దేరారు నాయుడుగారు.

❊ ❊ ❊

ఈ విషయం జరిగి పదేళ్లు దాటిపోయింది. ఇప్పుడు నాయుడుగారు వేటాడటంలేదు. అప్పటి పులికూనల్ని కొన్ని రోజులు పెంచి శ్రీశైలం రిజర్వాయర్ ఫారెస్టు ఆఫీసర్లకు అప్పజెప్పారు.

ఇప్పుడు ఆయన తుపాకి గోడకు వ్రేలాడుతుంది. అలంకారప్రాయంగా దాని పక్కన ఆఖరున వేటాడిన పులి చర్మం ఉంది. దాని ఎదురుగా ఆయన పడకకుర్చీ వేసిఉంటుంది. ఆయన ఆ కుర్చీలో కూర్చొని ఏదో ఆలోచిస్తూ కనిపిస్తారు చుట్టకాల్చుకుంటూ!

## దయానిధి

వెలుగు రేఖలను
  వెదజల్లిన కాంతి పుంజం
త్యాగ నిరతికి దీటుగా
నిలిచిన శాంతి ధ్వజం
చిమ్మ చీకటిలో
కనిపించిన జ్యోతి
శిలువ వేయబడి
రక్తాన్ని చిందించిన దయానిధి
అఖిలావనికి సహనాన్ని
అందించిన కరుణా నిధి

—స్నేహకాంతి

ఇప్పుడు ఆయన ముఖంలో విసుగు కోపం లేవు. ప్రశాంతత వుంది. కళ్ళలో క్రౌర్యంలేదు. కరుణఉంది. ఆయన నవ్వు భయంకరంగా వుండటంలేదు. సౌమ్యంగా వుంటున్నది. ఆయన మాటల్లో శాసింపులేదు. నెమ్మదితనంవుంది అప్పుడు గంభీరంగా వుండేవారు. ఇప్పుడూ అలాగే ఉన్నారు. కానీ అప్పటికీ ఇప్పటికి చాలా తేడా! కాని ఆయన ఎపుడూ ఏదో సమస్యతో బాధపడుతున్నట్టు కనిపిస్తారు.

ఇంకొక విషయం ఆయనకు ఇప్పుడు సంతానంలేదు అనే బాధ లేదు. ఆయన వంశాన్ని ఉద్ధరించే వాడున్నాడు వారికి ఇప్పుడు అయిదేళ్ళ కొడుకు. కానీ ఆ కొడుకుకు కళ్ళులేవు. పుట్టు గుడ్డి.

## పాఠకుల సలహాలు-సూచనలు

పాఠకులు లేకుంటే పత్రికే లేదు. వారి అభిరుచికి తగ్గట్టుగా పత్రికను తీర్చిదిద్దితే పత్రిక వారి అభిమానానికి పాత్రమవుతుంది. అందుకే పాఠకుల సలహాలు-సూచనలను ఆహ్వానిస్తున్నాం. మాకు ఆచరణకు వీలున్నంత వరకూ సలహాలను అమలు పరిచేందుకు ప్రయత్నిస్తాం.

ఈ శీర్షికకు పాఠకులు తమఅమూల్యమైన సలహాలనిచ్చి సహకరించవలసిందిగా కోరుతున్నాం.

నిర్మాణాత్మకమైన విమర్శల్నికూడా కోరుతున్నాం. అంతేకాదు. పొగుడుతూరాసే ఉత్తరాలకు ఈశీర్షికలో స్థానంలేదనికూడా గమనించగలరు.

తెలుగు పత్రికలలో ఇటువంటి శీర్షిక పెడుతున్న మొదటి పత్రిక మయూరి.

'పాఠకుల సూచనలు - విమర్శలు' అనిరాసి మయూరి అడ్రస్‌కు పంపండి.


## ఏజెంట్లు కావాలి

దిగువ కేంద్రాలలో డిపాజిట్ చెల్లించి తమ స్వంత బాధ్యతపైమా పత్రికలను అమ్ముటకు ఏజెంట్లు కావలెను. వలయువారు వెంటనే సంప్రదించగలరు.

1. మచిలీపట్నం
2. కరీంనగర్
3. రామచంద్రాపురం
4. సాలూరు
5. రాజోలు
6. తణుకు
7. నర్సాపురం
8. నిడదవోలు
9. కైకలూరు
10. తిరువూరు
11. నందిగామ
12. బాపట్ల
13. సత్తెనపల్లి
14. బద్వేల్
15. రాయచోటి

ఇట్లు
సర్క్యులేషన్ మేనేజరు
కాకతీయ పబ్లికేషన్స్
5-8-55/ఎ నాంపల్లి స్టేషన్‌రోడ్
హైదరాబాద్ - 500 001


# చిత్రభూమి